# దోమల స్వైరవిహారం



ఛత్రపతి శివాజీ నగర్‌లో రోడ్డుపైన డ్రైనేజీ మురుగు నీరు

- రోడ్లపైనే పారుతున్న డ్రైనేజీ మురుగు
- ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**కాలనీలు బస్తీల్లో మురుగు రోడ్లపై పారుతుండడంతో పాటు ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఎంటమాలజీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కింది స్థాయి సిబ్బంది నెలలో రెండు, మూడు మార్లు మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు.**

**ఎర్రగడ్డ/బోరబండ జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీలలో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని రెండు, మూడు కాలనీలు తప్ప మిగతావన్నీ మురికివాడలే ఈ మురికివాడలలో ఎక్కువగా ఓల్డ్ సుల్తాన్ నగర్, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, బీ శంకర్‌లాల్ నగర్, బంజారానగర్, ప్రేమ్‌నగర్ కుంట, నేతాజీనగర్, నటరాజ్‌నగర్ తదితర బస్తీలలో డ్రైనేజీ, మురుగు నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. కొన్ని బస్తీలలో రెండు, మూడు రోజులకోసారి కూడా స్వీపింగ్ చేయడంలేదని, సకాలంలో చెత్తకుప్పలను తొలగించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో ఫాగింగ్ నిర్వహించిన దాఖలాలు లేవని తెలిపారు.



అన్నానగర్ వెళ్లే దారిలో ఉన్న చెత్త కుప్ప

### బోరబండలో ఓపెన్ నాలాలతో..

బోరబండ డివిజన్ సాయిబాబానగర్, సైట్-3 వాంబె గృహ సముదాయంలోని రోడ్లపై ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. దీంతో తీవ్ర దురువాసన వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు వ్యాప్తి చేందుతున్నాయి. బోరబండ వినాయకరావునగర్‌లోని సాయిబాబా గుడి వెనుక వైపు ఉన్న నాలా వద్ద వర్షపు నీరు నిల్వ ఉంటుంది.

రహ్మత్‌నగర్ ఎగువ ప్రాంతాల నుంచి సైట్-3 బస్తీల వైపు వచ్చే వర్షపు నీరు సాఫీగా వెళ్లకుండా ఇళ్ల యజమానులు సిమెంట్ కట్టలు కట్టారు. దీంతో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండి ఇసుక మేటలు వేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



### చెత్తను తొలగించడం లేదు

ప్రేమ్‌నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ప్రేమ్‌నగర్ కుంట తదితర బస్తీలలో రెండుమూడు రోజులకు ఒకసారి కూడా చెత్త తొలగించడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి.

\- శివకుమార్, ప్రేమ్‌నగర్



### ఫాగింగ్ చేయాలి

రోడ్లపై చెత్త ఎక్కడికక్కడే నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు కనీసం వారానికి ఒక్కసారైనా ఫాగింగ్ చేయాలి. రోడ్లపై చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలి.

\- కానూరి గౌరి, రహ్మత్‌నగర్

## ఫ్లోరింగ్ క్లీన్.. లిఫ్ట్ ఆన్

- కలెక్టరేట్‌లో కనిపించిన స్వచ్ఛత



వినియోగంలోకి వచ్చిన లిఫ్ట్

**హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్‌లో పరిసరాలు పరిశుభ్రమయ్యాయి. ఫ్లోరింగ్‌పై పేరుకుపోయిన దుమ్ము, ధూళిని తొలగించారు. నాలుగు రోజులుగా ఆగిపోయిన లిఫ్ట్ ఎట్టకేలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, సాధారణ ప్రజలు సంతోషపడ్డారు. కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్‌జూబ్లీ భవనం నిర్వహణ అధ్వానంగా మారడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో క్లీనింగ్ చేయరు..! లిఫ్ట్ పనిచేయదు..!! అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగం అధికారులు స్పందించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక సిబ్బందితో భవనం పరిసరాలను, మెట్లను శుభ్రం చేయించారు. ఫ్లోరింగ్‌పై పేరుకుపోయిన దుమ్ము, పావురాల వ్యర్థాలను తొలగించారు. ప్రధానంగా లిఫ్ట్‌కు మరమ్మతు చేయించి మధ్యాహ్నం వరకు అందుబాటులోకి తీసుకురావడంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చిన పౌరులు సాఫీగా వెళ్లారు. నిన్న, మొన్నటి వరకు వాటర్‌క్యాన్లు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడిన ఉద్యోగులు శుక్రవారం లిఫ్ట్ పనిచేయడంతో తెప్పించుకున్నారు. కాగా, భవన నిర్వహణ పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ఆంధ్రజ్యోతి'కి అధికారులు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

## సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

**అమీర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న బీజేఆర్‌నగర్-2కు చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం తన నివాసంలో రూ. 1,20,000 విలువగల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, హన్మంతరావు, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ తదితరులు ఉన్నారు.

## పిల్లల్లో నాడీ సంబంధిత వ్యాధులు




ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సమావేశంలో వైద్యులు

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** చాలామంది పిల్లల మెదడులోని హైడ్రోసెఫాలస్ సమస్య వల్ల అధిక నీరు, మెదడు కణితులు, వెన్నుపాము వంటి నాడీ సంబంధిత వ్యాధులతో పుడతారని వైద్యులు తెలిపారు. దీని వల్ల చర్మం నుంచి దాని కవచం బయటకు వస్తుందని, దీనిని సాధారణంగా మైలోమెనింగోకోలె అని వ్యవహరిస్తారని వివరించారు. అలాంటి బాధితుల్లో చాలామందికి ఒక రోజు అత్యవసర ఆపరేషన్ అవసరమని వివరించారు. ఈ తరహా జబ్బుల గురించి మరింత తెలుసుకోవడానికి అవగాహన కల్పించేందుకు, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ నుంచి నైపుణ్యం కలిగిన నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరోసర్జరీ ద్వారా బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాక్టికల్ అనుభవాలను అందించేందుకు వర్క్‌షాప్‌లను నిర్వహించినట్లు తెలిపారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని న్యూరోసర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సుచంద భట్టాచారి మాట్లాడుతూ తెలంగాణ, చుట్టుపక్కల ఉన్న వైద్యులకు పీడియాట్రిక్ న్యూరోసర్జరీ పరిస్థితులకు సంబంధించి వివరణాత్మక జ్ఞానాన్ని అందించాలన్నారు. న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ మానస్ పాణిగ్రాహి మాట్లాడారు. ఈ సదస్సులో వైద్యులు ఆర్థర్ డా.కున్హా, డాక్టర్ బీరప్ప నగరి, ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ ప్రెసిడెంట్ డాక్టర్ వీవీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగీపై అప్రమత్తత అవసరం

**ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దాం**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

**ఖైరతాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** వర్షాకాలంలో వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలుతున్నాయి. పలు ప్రాంతాల్లో డెంగీతో ఎంతోమంది బాధపడుతుండగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇళ్లలో దోమలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే పలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోగలమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### పగటిపూట దోమతో డెంగీ...

డెంగ్యీ అనేది వైరల్ ఫీవర్. ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ డెంగ్యీ వ్యాధిని వ్యాపింపజేస్తుంది, ఇది పగటిపూట ఎక్కువగా కుడుతుంది. ఈ దోమ నీరు నిల్వ ఉండే ప్రాతల్లో గుడ్లు పెడుతుంది. నీటి తొట్టెలు, పూల కుండీలు, వాటి కింద ఉండే ట్రేలు, పాడుబడ్డ కూలర్లు, ఇంటి సజ్జాల పైన నిల్వ ఉండే వర్షపునీరు, మూతలేని డ్రమ్ములు, ట్యాంకర్లు, వాడని వంట పాత్రలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, నల్లా గుంతలు, ప్లాస్టిక్ కప్పులు, లిఫ్ట్ గుంతలు, నీరు నిల్వ ఉండే పాత్రల్లో దోమలు గుడ్లు పెట్టే అవాసాలుగా ఉంటాయి. దోమ గుడ్డు నుంచి మొదట పిల్ల దోమ (లార్వా) విడుదలై వారం రోజుల్లో దోమగా మారుతుందని, ఎడిస్ ఈజిప్ట్ దోమ కుడితే డెంగీ వస్తుంది. జ్వరంతో పాటు చర్మంపై దద్దుర్లు, తలనొప్పి, కళ్లలో మంటలు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటే డెంగీగా భావించవచ్చునని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

### డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై..

డెంగీ జ్వరాలను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ కృషి చేస్తోంది. దీని కోసం ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటింపజేయాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. ఆ రోజున ఇంట్లోని ఏ పాత్రల్లోనూ నీరు లేకుండా చూడడంతో పాటు ఇల్లు మొత్తం పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నాం. దీంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు చేపడుతూ పెద్దలను అప్రమత్తం చేస్తున్నాం. ఎంటమాలజీ విభాగం సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తుండడంతో పాటు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మందులను పిచికారి చేస్తున్నాం. ప్రతి ప్రాంతంలో వారంలో కనీసం ఒకసారి దోమల నివారణలకు ఫాగింగ్ చేస్తున్నాం.

\- రజని, సీనియర్ ఎంటమాలజిస్ట్, ఖైరతాబాద్ జోన్

## సీపీఆర్‌లో శిక్షణ పొందాలి

- డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రతిఒక్కరూ సీపీఆర్‌పైన శిక్షణ పొందాలని, గుండెపోటు, ఇతర కారణాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి వెంటనే బాధితులను ఆస్పత్రికి తరలించడం వల్ల ముప్పు నుంచి తప్పించవచ్చునని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్ తెలిపారు. హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని ప్రకృతి చికిత్సాలయంలో బల్కంపేట రేణుకాఎల్లమ్మ దేవాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలకు శుక్రవారం సీపీఆర్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్ మాట్లడుతూ బోనాల సందర్భంగా విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి, స్వచ్ఛంద కార్యకర్త తప్పనిసరిగా సీపీఆర్‌పైన అవగాహన కలిగివుండాలని సూచించారు. ఈ కార్యక్రమం డాక్టర్ రేవతి, కిమ్స్ వైద్య బృందం, మీడియా అధికారి శ్రీనివాసరావు, వైద్యులు, ఆశలు, దేవాదాయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు మూసివేత

- వాహనాల దారి మళ్లింపు

**అమీర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రోడ్డును ఇరువైపులా మూసివేసి వాహనాలను దారి మళ్ళిస్తున్నారు. నేటి నుంచి ఈ ఆంక్షలు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 8 గంటల వరకు అమలులో ఉంటాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

- అమీర్‌పేట, బేగంపేట నుంచి వస్తున్న వాహనాలను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మీదుగా సోనీ వైన్స్, ఉమేష్‌చంద్ర విగ్రహం మీదుగా పంపిస్తున్నారు.
- సనత్‌నగర్, ఫత్తేనగర్, బేగంపేట బైపాస్ రోడ్డు నుంచి వస్తున్న వాహనాలను సిక్స్ ఫీట్ రోడ్డు నుంచి, బల్కంపేట బతుకమ్మ చౌరస్తా మీదుగా ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట మీదుగా తరలిస్తున్నారు.

### 4 చోట్ల వాహనాల పార్కింగ్

ఈ నెల 9న జరుగనున్న ఎల్లమ్మ కల్యాణం నేపథ్యంలో 4చోట్ల వాహనాల పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. ఫత్తేనగర్ రైల్వే సమీపంలోని ఫ్లైవోవర్ బ్రిడ్జి కింద ఇరు వైపులా, బల్కంపేట ప్రకృతి చికిత్సాలయం, ఎస్ఆర్‌నగర్‌లోని రోడ్లు భవనాల శాఖ, అమీర్‌పేటలోని శ్రీ గురుగోబింద్‌సింగ్ ప్లే గ్రౌండ్‌లలో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. రేపటి నుంచి రోడ్లు భవనాల శాఖ కార్యాలయం పక్కన ఉన్న రోడ్డుకు అడ్డంగా బారీకేడ్లను ఏర్పాటు చేసి మూసి వేయనున్నారు.

# ఎల్లమ్మ ఆలయం ఉత్సవ కమిటీని రద్దు చేయాలి

**ఈవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల ఆందోళన**



ఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**అమీర్‌పేట, జూలై 5(ఆంధ్రజ్యోతి):** బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నిర్వహణ కోసం దేవాదాయ శాఖ నూతనంగా ప్రకటించిన ఉత్సవ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఈవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, శంకర్‌గౌడ్, ఐలా మధుగౌడ్, మహేష్, కృష్ణయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ పంపిన పేర్లు కాకుండా స్థానికేతరుల పేర్లను ప్రకటించడం సరికాదని అన్నారు. 14మంది పేర్లతో కూడిన జాబితాను పంపిస్తే కేవలం 11 మందితో ఉత్సవ కమిటీని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కేవలం ఐదుగురు స్థానికులకు అవకాశం ఇస్తూ 9మంది స్థానికేతరులను కమిటీలో నియమించడం గ్రూపులను ప్రోత్సహించడమే అని వారు అన్నారు. ఈ కమిటీని రద్దు చేయాలని కోరుతూ ఈవో అంజనీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోదాస్ నవీన్, కడవారి లక్ష్మణ్, పద్మావతి, ఆండాల్, సుకన్య రాజేశ్వరి, పద్మరాణి, అనితాసింగ్ తదితరులు ఉన్నారు.

### నూతన ఉత్సవ కమిటీ సభ్యులు వీరే...

ఈనెల 9న జరుగనున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నిర్వాహణ బాధ్యతలు చేపట్టేందుకు గాను దేవాదాయ శాఖ నూతన ఉత్సవ కమిటీని నియమిస్తూ శుక్రవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. సభ్యులుగా ఎస్.శ్రీనివాసరెడ్డి, గోదేసి అజయ్, చుక్క బాబు, పోతరాజు భాస్కర్, మిర్యాల నవీన్‌కమార్, మరియగడ్డ మహేష్, కె.పద్మరాణి, సంగబోయిన శ్రీనివాసరావు, అనితా సింగ్, వై.చక్రధర్‌యాదవ్, గోకుల్ రాకేశ్ యాదవ్ ఉన్నారు.

## రేపు జగన్నాథ స్వామి రథయాత్ర



దేవతామూర్తులు

**బంజారాహిల్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని జగన్నాథ స్వామి రథోత్సవం ఈ నెల 7న జరగనున్నది. అదే రోజు వనవాసానికి వెళ్లి స్వామి వారు తిరిగి ఈ నెల 15న ఆలయానికి వస్తారు. ఈ నెల 17 నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ఈ వేడుకకోసం ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా ఖాళీ ప్రదేశాలను గుర్తించి పార్కింగ్ వసతి కల్పించనున్నారు.

పూరీలో మాదిరిగానే ఇక్కడ జగన్నాథ స్వామి రథయాత్ర ప్రతియేటా నిర్వహిస్తారు. జగన్నాథుడికి, సుభద్రాదేవికి, భలభద్రుడికి ప్రత్యేకంగా రథాలు అలంకరించి ఊరేగిస్తారు. మూడు రథాలను బంగారంతో రూపొందించిన చీపురుతో శుభ్ర పరుస్తారు. యేడాది కోసం స్వామి వారి తన పరివారంతో ఆలయాన్ని వదిలి విహార యాత్రకు వెళ్తారని చరిత్ర చెబుతుంది. ఆయనను సాగనంపేందుకు రథోత్సవం నిర్వహిస్తారని పండితులు చెబుతున్నారు. రథోత్సవం తరువాత పది రోజుల పాటు స్వామి వారు ఆలయంలో ఉండరు. ఇదే సాంప్రదాయాన్ని ఇక్కడ కొనసాగిస్తున్నారు. రథోత్సవం అనంతరం దేవతా విగ్రహాలను రోడ్డు నంబరు 12లో ఉన్నకనకదుర్గా దేవాలయంలో ఉంచుతారు. పది రోజుల అనంతరం వేడుకగా తిరిగి ఆలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు.

## ఎన్‌సీఎస్ జాబ్‌మేళాలో 86 మంది ఎంపిక

**సనత్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీసెస్), డాన్‌బాస్కో, దిశ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు హాజరయ్యారు. సెయింట్ థెరిస్సా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 17 సంస్థల ప్రతినిధులు పాల్గొని 86 మందిని ఎంపిక చేశారని దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కో ఆర్డినేటర్‌లు ఐవన్ వాజ్, రంగారెడ్డి జిల్లా ఎన్‌సీఎస్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

## రాంవిలాస్ పాశ్వాన్ సేవలు మరువలేనివి




కేక్ కట్ చేస్తున్న రిటైర్డ్ జడ్జి నారాయణ, డాక్టర్ ఏ.ఎస్.శ్రీనివాస్, భీమారావు తదితరులు

**పంజాగుట్ట, జూలై 5(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ దళిత నాయకుడు, కేంద్ర మాజీమంత్రి, పద్మభూషణ్ అవార్డ్ గ్రహీత దివంగత నేత రాంవిలాస్ పాశ్వాన్ చేసిన సేవలు మరువలేనివని రిటైర్డ్ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ అన్నారు. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సామాజిక న్యాయ దినోత్సవ వేడుకలు, రాంవిలాస్ పాశ్వాన్ జయంతి వేడుకలు జరిగాయి. హైకోర్టు న్యాయవాది ఇ.భీమారావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, తదితరులతో కలిసి నిమ్మ నారాయణ కేక్ కట్ చేశారు. అనంతరం రాంవిలాస్ పాశ్వాన్ చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక, రాజకీయ విశ్లేషకుడు సి.బి ప్రసాద్, పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బాల కృష్ణ, సామాజిక గుంటి రాజేష్, వివిధ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




వేవ్‌రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## స్టార్ కార్పొరేట్ క్లినిక్ ప్రారంభం

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కార్పొరేట్ ఉద్యోగులకు వైద్యసేవలు అందించడానికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో వేవ్‌రాక్ సెజ్‌తో భాగస్వామ్యంగా కలిసి వేవ్‌రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. స్టార్ ట్రామా యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ మద్దతుతో సమగ్ర వైద్య సేవలను అందిస్తుందని, అన్ని రకాల అత్యవసర పరిస్థితులకు తక్షణ సహాయాన్ని పొందచ్చునని తెలిపారు. అత్యవసర సేవల కోసం బాధితులు 9071104108 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ హెడ్ కల్నల్ సంజయ్ భరద్వాజ్, స్టార్ ఆస్పత్రి గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మెదక్కర్, వాకా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## సెల్‌పోన్ స్నాచింగ్ చేసిన ఇద్దరి అరెస్ట్

- పరారీలో ఒకరు

**బంజారాహిల్స్, జూలై 5(ఆంధ్రజ్యోతి):** ఒంటరిగా వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని సెల్‌ఫోన్ స్నాచింగ్ చేస్తున్న ఇద్దరిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నాడు. ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న ర్యాపిడోలో పనిచేసే ఓ వ్యక్తి జీవీకే మాల్ వద్దకు వచ్చిన వినియోగదారుడి కోసం ద్విచక్ర వాహనంపై కూర్చొని ఎదురుచూస్తున్నాడు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ పర్సు కొట్టేస్తావా అంటూ గొడవకు దిగారు. కొద్దిసేపటికి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. జేబులో చూసుకొని వీవో సెల్‌ఫోన్ కనిపించలేదు. బాధితుడు వెంటనే బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులుగా ఆర్‌కే పేట్‌కు చెందిన మహ్మద్ అజీజ్, మంగళహాట్‌కు చెందిన మహ్మద్ షాహీద్, ఢిల్లీకి చెందిన జమీల్‌గా గుర్తించారు. అజీజ్, మహ్మద్ షాహీద్‌లను అరెస్టు చేయగా జమీల్ పరారీలో ఉన్నాడు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పార్క్ చేసిన ద్విచక్రవాహనం మాయం

**యూసుఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయప్రకాష్‌నగర్‌కు చెందిన సుమంత్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ నెల 4న ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశాడు. ఉదయం వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు.

### ల్యాప్‌టాప్ చోరీ

హాస్టల్‌లో ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. ఆంధ్రప్రదేశ్ రేపల్లెకు చెందిన ఆదిత్యకుమార్ గత నెల 28న తన ల్యాప్‌టాప్ తీసుకుని మధురానగర్‌లోని హాస్టల్‌కు వచ్చాడు. అయితే ఈ నెల 2న ఉదయం తన బ్యాగ్‌లో చెక్ చేయగా ల్యాప్‌టాప్ కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రయాణికుడి బ్యాగ్..

**యూసుఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ నుంచి బస్సులో నగరానికి వచ్చిన వ్యక్తి బ్యాగ్ చోరీ అయింది. బాధితుడు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ మచిలీపట్నంకు చెందిన రిజ్వాన్ ఈనెల 3న రాత్రి ఏపీఎస్ఆర్టీసీ బస్సులో నగరానికి వచ్చాడు. బస్సు ఎస్సార్‌నగర్ వచ్చిన తరువాత రిజ్వాన్ దిగే ముందు తన బ్యాగ్ కోసం చూడగా కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డబ్బు తిరిగి ఇవ్వమంటే మహిళపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

**యూసుఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ మహిళపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లో నివసించే సీహెచ్ రాణికి ఎల్లారెడ్డిగూడలో టెంట్‌హౌస్ నిర్వహించే శివకుమార్‌తో గత ఐదేళ్లుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో శివకుమార్, అతని కుటుంబ సభ్యులకు కలిపి రాణి రూ. 9లక్షలు అప్పుగా ఇచ్చింది. ఆ తరువాత రూ. 2.2లక్షలకు అతని వద్ద కారు కొనుగోలు చేసింది. ఆ కారును రాణి పేరుమీద రిజిస్టర్ చేయలేదు. రాణి నగదు కోసం శివకుమార్‌కు ఫోన్‌లు చేసింది. దీంతో శివకుమార్ ఈ నెల 3న ఆమె ఇంటికి వచ్చి కుర్చీలు విసిరేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమె చెంపపై కొట్టాడు. చంపేస్తా అంటూ బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన రాణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## అన్ని కేసుల నుంచి విముక్తి కలిపించండి




కేసుల నుంచి విముక్తి కలిగించాలని బహిరంగ లేఖ విడుదల చేసి మాట్లాడుతున్న జెరూసలేం మత్తయ్య

**పంజాగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఓటుకు నోటు కేసుతో పాటు తనపై నమోదైన అన్ని కేసుల నుంచి విముక్తి కలిగించాలని ఆల్ ఇండియా దళిత, క్రైస్తవ సంఘాల సమాఖ్య కార్యదర్శి జెరూసలేం మత్తయ్య విజ్ఞప్తి చేశారు. 10 సంవత్సరాలుగా ఆయా కేసు విచారణలో భాగంగా పలు కోర్టుల వెంట తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా చాలా నష్టపోయాను, నేటికీ నాంపల్లి ఈడీ కోర్టు, సుప్రీంకోర్టుకు తిరుగుతూ న్యాయవాదులు ఫీజు చెల్లించలేక పోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులకు, కేంద్ర దర్యాప్తు సంస్థలకు తనను కేసుల నుంచి విముక్తి చేయాలని రాసిన బహిరంగ లేఖను విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ హైకోర్టు క్వాష్ పిటిషన్, సుప్రీంకోర్టులో క్వాష్ అప్పీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర 5కేసులను సత్వరమే పరిష్కరించాలని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డిలను కోరారు.

## ఖరీదైన పార్కు స్థలం ఆక్రమణ

- స్థానికుల ఫిర్యాదుతో ప్రహరీని కూల్చివేసిన జీహెచ్ఎంసీ

**బంజారాహిల్స్, జూలై 5(ఆంధ్రజ్యోతి):** ఖరీదైన పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాడు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు డీఆర్ఎఫ్ సిబ్బందితో కూల్చివేతలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నం.10సీలో జీహెచ్ఎంసీకి చెందిన 300 గజాల పార్కుస్థలం ఉంది. రాఘవేంద్రరావు అనే వ్యక్తి దాన్ని ఆక్రమించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాడు. ఆక్రమణ విషయాన్ని కాలనీవాసులు జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్ 18 టౌన్‌ప్లానింగ్ అధికారులు విచారణ జరిపి ఆక్రమణ వాస్తవమేనని నిర్ధారించి డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించి కూల్చివేతలు చేపట్టారు. పార్కులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఏపీ సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



**ఆంధ్రప్రదేశ్‌లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా తెలంగాణకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడికి బేగంపేట విమానాశ్రమంలో స్వాగతం పలుకుతున్న టీటీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీపతి సతీష్**

\- బేగంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి)



ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికేందుకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న టీడీపీ జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు సలీం, మాల్యావతి, విజయలక్ష్మి, యాదగిరి తదితరులు

\- బంజారాహిల్స్, జులై 5(ఆంధ్రజ్యోతి)



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీ బందోబస్తు

**అడ్డగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** నిరుద్యోగుల టీజీపీఎస్సీ బంద్ కారణగా రైళ్లలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారని భావించిన గోపాలపురం పోలీసులు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీ బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా రైలు దిగగానే బయటికి వస్తున్న ప్రయాణికుల నుంచి వివరాలు సేకరించి బయటికి పంపించారు. గ్రూపులుగా బయటికి వస్తున్న ప్రయాణికుల్ని బయటికి పిలిపించి ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎక్కడికి వెళుతున్నారు, వారి వివరాలు, పేర్లు, సెల్ నంబరు రాసుకుని బయటికి పంపిస్తున్నారు.

## సీపీఆర్‌లో శిక్షణ పొందాలి

- ప్రాణాపాయ స్థితిలో రక్షించొచ్చు
- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట్

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రతిఒక్కరూ సీపీఆర్‌పైన శిక్షణ పొందాలని, గుండెపోటు, ఇతర కారణాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సీపీఆర్ చేసి వెంటనే బాధితులను ఆస్పత్రికి తరలించడం వల్ల ముప్పునుంచి తప్పించవచ్చునని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట్ తెలిపారు. హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని ప్రకృతి చికిత్సాలయంలో బల్కంపేట రేణుకాఎల్లమ్మ దేవాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలకు శుక్రవారం సీపీఆర్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ బోనాల సందర్భంగా విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి, స్వచ్ఛంద కార్యకర్త తప్పనిసరిగా సీపీఆర్‌పైన అవగాహన కలిగివుండాలని సూచించారు. డాక్టర్ రేవతి, కిమ్స్ వైద్య బృందం, మీడియా అధికారి శ్రీనివాసరావు, వైద్యులు, ఆశలు, దేవాదాయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

- వరంగల్ ఠాణాలో ఫిర్యాదు
- సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో బాలికను అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు



సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో బాలికను అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి బృందం

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కిడ్నాప్‌కు గురైన బాలికను సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి మహిళా కానిస్టేబుళ్లు అదుపులోకి తీసుకుని వరంగల్ జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ దెబ్బతి బెనర్జీ తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్‌కు చెందిన బాలిక రెండు రోజుల క్రితం కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు వరంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పోలీసులు అప్రమత్తమై వరంగల్, ఖాజీపేట్, సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు లుక్‌ఔట్ నోటీసులు, మిస్సింగ్ అయిన బాలిక ఫోటోలను జారీచేశారు. వెంటనే సికింద్రాబాద్ డివిజనల్ జోన్ ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి టీం బృందం మహిళా కానిస్టేబుళ్లు గురువారం రాత్రి సికింద్రాబాద్ నుంచి వెళుతున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టారు. సింహపురి రైలులో బాలికతో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు సమాచారం రావడంతో నాగమ్మశక్తి టీం ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు నీలం మింజ్, ప్రియాంకలు ఓ వ్యక్తితో ఉన్న బాలికను ఇద్దరిని అదుపులోకి తీసుకుని వరంగల్ ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను తీసుకెళుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

## బ్రాహ్మణ బస్తీలో వ్యక్తి హత్య



మృతదేహం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

**బౌద్ధనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** తాగిన మైకంలో మాటమాట పెరిగి ఓ యువకుడు మరో వ్యక్తిపై రాడ్‌తో కొట్టి హత్య చేసిన సంఘటన శుక్రవారం ఉదయం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన కమ్మరి రామచందర్ (50), చిత్తూరు జిల్లా వెంకటగిరికి చెందిన పృథ్వీలు వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో ఓ భవనంలో పనిచేస్తున్నారు. భవనం మరమ్మతులు చేస్తుండటంతో రామచందర్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి రెండో అంతస్తులో రామచందర్, పృథ్వీలు పూటుగా మద్యం సేవించారు. డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య మాటమాట పెరగటంతో పృథ్వీ రామచందర్ తలపై ఇనుపరాడ్‌తో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం పనులు చేయటానికి మనుషులు రావటంతో రెండో అంతస్తులో రామచందర్ విగతజీవిగా పడి ఉండటంతో భవన యాజమాని, పోలీసులకు సమాచారమందించారు. ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. క్లూస్‌టీం రంగంలో దిగి వివరాల సేకరించారు. నిందితుడు పృథ్వీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇనుపరాడ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కుమారుడు శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హనుమాన్ టెంపుల్ హుండీలో చోరీకి యత్నం

- ముగ్గురిని అరెస్ట్ చేసిన కార్ఖానా పోలీసులు

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఆలయ హుండీ చోరీకి యత్నించిన ముగ్గురిని కార్ఖానా పోలీసులు అరెస్ట్ చేశారు. కార్ఖానా బీఆర్‌ఓ జంక్షన్‌లో ఉన్న హనుమాన్ ఆలయలో ఈనెల 3వ తేదీ ముగ్గురు దుండగులు చోరీకి యత్నించారు. ఇద్దరు బయట కాపలాగా ఉండగా, ఒకడు తాళం పగల గొట్టి ఆలయంలోకి ప్రవేశించాడు. హుండీని తెరిచే యత్నం చేస్తుండగా గుర్తించిన స్థానికులు ఆలయం వద్దకు చేరుకున్నారు. స్థానికులను గమనించిన ఇద్దరు దొంగలు పరారు కాగా, గుడిలో ఉన్న దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన దొంగ ఇచ్చిన సమాచారం మేరకు మహ్మద్ ఖైఫ్, ఎండీ తాహెర్, బి రోహిత్‌లను అరెస్ట్ చేశారు. మహ్మద్ ఖైఫ్‌పై గతంలో చోరీ కేసు ఉందని పోలీసులు తెలిపారు.



అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రసూల్‌పురా బీరప్పగుడి వద్ద అన్నదానం చేస్తున్న కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి



తుకారాంగేట్ సాయిబాబా ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త కుప్ప



అడ్డగుట్ట ఢిల్లీ పబ్లిక్ స్కూలు వద్ద పేరుకుపోయిన చెత్త కుప్ప



బోయగూడ మేకలమండి ఎదురు రోడ్డులో చెత్తకుప్పలు

# బాబోయ్ దోమలు

- మురికినీటి కాల్వలు, చెత్తకుప్పలలో విజృంభిస్తు్న దోమలు
- విషజ్వరాల బారిన పడుతున్న ప్రజలు



బోయగూడ ఐడీహెచ్ కాలనీ సమీపంలో చెత్తకుప్పలు, మురికినీటి నిల్వలు



గాంధీ ఆస్పత్రి వెనుక రోడ్డులో మురికినీరు

సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాలు, బస్తీల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు శుభ్రం చేయాల్సిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది కనిపించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. తాత్కాలికంగా మాత్రమే తొలగించిన కొద్ది సేపటికే మళ్లీ చెత్త పేరుకుపోతుంది. దీంతో రాత్రి సమయంలో విపరీతమైన దోమల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇక్కడ చెత్త వేయొద్దన్నందుకు గతంలో జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై దాడి కూడా జరిగింది.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)



అన్నానగర్ నాలాలో

### ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



నర్సింగ్ - తుకారాంగేట్

అడ్డగుట్ట డివిజన్‌లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు గంగజమునా హోటల్, అడ్డగుట్ట రెండు పులులు చౌరస్తా, తుకారాంగేట్, సాయినగర్ పలు ప్రాంతాల్లో వర్షం నీళ్లు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు.

### అనేక సార్లుఫిర్యాదు చేశాం



మహేష్

తుకారాంగేట్, అడ్డగుట్ట, మరాఠ బస్తీ, సాయినగర్ వెంకటనగర్ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజు తీయాల్సిన చెత్త తొలగించకపోవడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రతిరోజు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్త కుప్పల్ని తొలగించేందుకు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## స్టార్ కార్పొరేట్ క్లినిక్ ప్రారంభం



వేవ్‌రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) :** కార్పొరేట్ ఉద్యోగులకు వైద్యసేవలు అందించడానికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో వేవ్‌రాక్ సెజ్‌తో భాగస్వామ్యంగా కలిసి వేవ్‌రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. స్టార్ ట్రామా యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ మద్దతుతో సమగ్ర వైద్య సేవలను అందిస్తుందని, అన్ని రకాల అత్యవసర పరిస్థితులకు తక్షణ సహాయాన్ని పొందచ్చునని తెలిపారు. అత్యవసర సేవల కోసం బాధితులు 9071104108 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ హెడ్ కల్నల్ సంజయ్ భరద్వాజ్, స్టార్ ఆస్పత్రి గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మెదక్కర్, వాకా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



పురస్కారాలను ప్రదానంచేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

## రావూరి భరద్వాజ, కాంతమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి):** తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్‌కు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం, ప్రముఖ గాయని డి.సురేఖామూర్తికి రావూరి కాంతమ్మ స్మారక సంగీత సేవా పురస్కారం ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో ఈ పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి బహూకరించి ప్రశంసించారు. అనంతరం జస్టిస్ శేషశయనారెడ్డి మాట్లాడుతూ రావూరి భరద్వాజ సాహితీసేవలు విలువైనవన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వతపరిషత్తు ప్రధానకార్యదర్శి డా.జె.చెన్నయ్య, రావూరి వెంకట కోటేశ్వరరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్ ప్రారంభం

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కృత్రిమ మేధ వినియోగించి పంటలకు వచ్చే తెగులు, చీడపీడలతోపాటు వచ్చే వ్యాధులను కచ్చితంగా గుర్తించడం, వాతావరణ వివరాలను అందించే 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్‌ను గ్రోవిరో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. గ్రోవిరో సంస్థ ఎండీ దేవేంద్ర దాసరి అప్లికేషన్‌ను ప్రారంభించారు. అప్లికేషన్ సాయంతో వ్యవసాయం, వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థవంతంగా అంచనా వేయగలమని చెప్పారు. ఉపగ్రహం నుంచి అందిన సమాచారంతో పంటలకు నీటి అవసరాన్ని 50 శాతం తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్ తరుణ్ పాంటాతోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మధుసూదనాచారి

## ఆంగ్లనాటక స్థాయిలో ఇనాక్ నాటకాలు

**చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) :** ఇనాక్ తెలుగు నాటకాలు షేక్‌స్పియర్ ఆంగ్లనాటక స్థాయిలో ఉంటాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా ఇనాక్ నాటక రచనపై ప్రసంగ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ప్రతికూల వాతావరణంలో తనను తాను తీర్చిదిద్దుకున్న శిల్పి ఇనాక్ అని అన్నారు. ప్రముఖ నాటక రచయిత ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు కీలకప్రసంగం చేస్తూ వర్తమాన సమాజానికి దారి, దీపం చూపని రచనలు వ్యర్థం అన్న ఆలోచన ఇనాక్ తన ప్రతి నాటకంలో నిర్భయంగా తెలిపారని విశ్లేషించారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం మాట్లాడారు. గానసభ కార్యవర్గసభ్యులు జంగంరావుగౌడ్, ప్రసాద్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. మల్లాదిఉష బృందం త్యాగరాజస్వామి కీర్తనల గోష్ఠి గానం నిర్వహించారు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో సౌకర్యాలపై చర్చిస్తున్న కలెక్టర్ గౌతమ్

## వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి

**మల్కాజిగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వాస్పత్రులకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యసేవలందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌పాత్రో వైద్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలియ తిరుగుతూ ఆయా విభాగాల్లో పనితీరును ఆయన సమీక్షించారు. వైద్యసదుపాయాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట వైద్య సదుపాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలపై ఆయన ఆరాతీశారు. ప్రభుత్వాసుపత్రిలోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాధుల గురించి రాబోయే రోజుల్లో వైద్యసౌకర్యాలు సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ గురించి వైద్యులను అడిగి వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ రఘునాథస్వామి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డిసిహెచ్ కోటియానాయక్, సౌందర్యలత, మల్కాజిగిరి డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆనంద్, ఏరియా ఆస్పత్రి సూరిండెంటెండ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

### అశోక్‌నగర్ బస్తీ దవాఖానాను తరలించొద్దు

**మల్లాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అశోక్‌నగర్ బస్తీ దవాఖానాను తరలించొద్దని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మల్లాపూర్ డివిజన్ అశోక్‌నగర్ కాలనీవాసులు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి బస్తీ దవాఖానా తరలింపు నిలిపివేయాలని వినతిపత్రం అందించారు. కమ్యూనిటీ హాల్‌లో స్థలం లేకపోవడంతో హెచ్‌బీకాలనీ డివిజన్‌కు తరలిస్తున్నామని వైద్యశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, బస్తీల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అరెస్టు చేసిన నిరుద్యోగులకు మద్దతు తెలపడానికి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మాజీ చైర్మన్‌లు గజ్జెల నాగేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజు సాగర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవికుమార్‌గౌడ్. లాఠీ చార్జిలో గాయాలపాలైన విద్యార్థులను పరామర్శించారు. స్వంతపూచికత్తుపై సాయంత్రం పోలీసులు వదిలిపెట్టారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

### మరమ్మతుల కారణంగా..

## నేడు విద్యుత్ నిలిపివేత

**మారేడుపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** మారేడుపల్లి 11 కే.వి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 6వ తేదీన (నేడు) శనివారం మారేడుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 10.30 నిమిషాల నుంచి 12 గంటల వరకు నెహ్రూనగర్ శివరామకృష్ణ కాలనీ, ఎల్.శంకర్‌నగర్, సయ్యద్ జలాలుద్దీన్ గార్డెన్, వెస్ట్ మారేడుపల్లి, ఎస్బీఐ ట్రైనింగ్, కేఎం టెంట్ హౌస్, అల్లాడి పెంటయ్యనగర్ ప్రాంతాలు, అదేవిధంగా ఎల్ఐసి కాలనీ, వైడబ్ల్యూసీఏ, జడ్జి కోటర్స్, సర్వసుకి కాలనీ, బూసారెడ్డి గూడ, కోర్టు ఏరియా ఫిషర్‌పుర, గాంధీ కాలనీలలో విద్యుత్ నిలిపివేయబడుతుంది. 12.30 నుంచి 2గంటల వరకు టీచర్స్ కాలనీ, డెక్కన్ క్లబ్, రిలయన్స్ డిజిటల్ ఏరియా ప్రాంతాలతో పాటు రామ్‌సర్ కేఫ్, మజీద్, గీతారెడ్డి పరిసర ప్రాంతాలు, సికింద్రాబాద్ నర్సింగ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుంది. అదేవిధంగా 3గంటల నుంచి 4.30 గంటల వరకు అంబేద్కర్ నగర్ బస్తీ, టీచర్స్ కాలనీ, లక్ష్మీనగర్, అడ్డగుట్ట, పాలిటెక్నిక్ కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుందని ఏడీఈ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



శ్రీమహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీతారామశర్మ దంపతులు

## శ్రీ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**తిరుమలగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** లాల్‌బజార్‌లోని శ్రీమహంకాళి దేవాలయంలో శుక్రవారం సీతారామశర్మ, దుర్గా నాగేశ్వరి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలలో భాగంగా అభిషేకం, అర్చన, కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. మహంకాళి మందిరం అధ్యక్షులు మురళీ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం, నిరంజన్, మధు, బాల్‌నగర్ మాజీ కార్పొరేటర్ నరేంద్ర చార్య, బ్రహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు శేషం రఘు కిరణాచార్యులు పాల్గొన్నారు.

## అమావాస్య అన్నదానాలతో సకల శుభాలు

**బోయిన్‌పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అమావాస్య రోజు దేవతలకు చేసే పూజలు, పాటించే పరిహారాల ద్వారా సకల శుభాలు కలుగుతాయని పురాణాలు గోచరిస్తున్నాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లిలోని ప్రముఖ అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయం జయగనర్ కాలనీలోని పోచమ్మ ఆలయం, చిన్నతోకట్టలోని కట్టమైసమ్మ ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో పూజలు చేశారు. చిన్నతోకట్ట ఆలయం వద్ద జాజుల విఠల్ రావు, విజయలక్ష్మి, సాయి, క్రాంతి, హరిహంత్, జనపాల శేఖర్, నర్సింగ్‌రావు, వినీత్, శివ, రవి, రామ్ ముదిరాజ్ పాల్గొన్నారు. జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద రామ్ గౌడ్, జంపన రవి, శశిధర్ గౌడ్, పవన్, వరప్రసాద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పిల్లల్లో నాడీ సంబంధిత వ్యాధులు

- పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సమావేశంలో వైద్యులు



ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సమావేశంలో వైద్యులు

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** చాలామంది పిల్లల మెదడులోని హైడ్రోసెఫాలస్ సమస్య వల్ల అధిక నీరు, మెదడు కణితులు, వెన్నుపాము వంటి నాడీ సంబంధిత వ్యాధులతో పుడతారని వైద్యులు తెలిపారు. దీని వల్ల చర్మం నుంచి దాని కవచం బయటకు వస్తుందని, దీనిని సాధారణంగా మైలోమెనింగోకోలె అని వ్యవహరిస్తారని వివరించారు. అలాంటి బాధితుల్లో చాలామందికి ఒక రోజు అత్యవసర ఆపరేషన్ అవసరమని వివరించారు. ఈ తరహా జబ్బుల గురించి మరింత తెలుసుకోవడానికి అవగాహన కల్పించేందుకు, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ నుంచి నైపుణ్యం కలిగిన నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరోసర్జరీ ద్వారా బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాక్టికల్ అనుభవాలను అందించేందుకు వర్క్‌షాప్‌లను నిర్వహించినట్లు తెలిపారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని న్యూరోసర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సుచంద భట్టాచార్జీ మాట్లాడుతూ తెలంగాణ, చుట్టుపక్కల ఉన్న వైద్యులకు పీడియాట్రిక్ న్యూరోసర్జరీ పరిస్థితులకు సంబంధించి వివరణాత్మక జ్ఞానాన్ని అందించాలన్నారు. న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ మానస్ పాణిగ్రాహి మాట్లాడారు. ఈ సదస్సులో వైద్యులు ఆర్థర్ డా.కున్హా, డాక్టర్ బీరప్ప నగరి, ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ ప్రెసిడెంట్ డాక్టర్ వీపీ సింగ్ పాల్గొన్నారు.